సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
శనివారం, 10, సెప్టెంబర్, 2022



'స్పందన' సమస్యలు సత్వరమే పరిష్కారం
- కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం
- 105 వినతుల స్వీకరణ

8లో

సిగినాపల్లి క్వారీలో రంగురాళ్ల తవ్వకాలు



గూడెంకొత్తవీధి మండలంలోని దామనాపల్లి పంచాయతీ సిగినాపల్లి, సంకాడ అటవీ ప్రాంతాల్లో రంగురాళ్ల తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి.

8లో



ఏసీబీకి చిక్కిన ఆర్ఐ

అరకులోయలో ఆర్ఐ మజ్జి అర్జున్ రూ.35 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకున్నారు.

- మెయిన్‌లో

రాజ్‌మాకు పూర్వ వైభవం





గిరిజన రైతులకు పంపిణీ చేస్తున్న రాజ్‌మా విత్తనాలు

గిరిజనులకు సిరులు పండించే రాజ్‌మాకు మళ్లీ పూర్వ వైభవం రానుంది. ఒకప్పుడు కాఫీ తర్వాత ప్రధాన వాణిజ్య పంటగా రాజ్‌మా చిక్కుళ్లనే సాగు చేసేవారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట దెబ్బతినడంతో సాగు విస్తీర్ణం తగ్గిపోయింది. విత్తనాల కొరత తదితర కారణాల వల్ల సాగు పట్ల ఆసక్తి తగ్గింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం 90 శాతం రాయితీపై విత్తనాలు పంపిణీ చేపట్టడంతో సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది.

- గత ప్రభుత్వం తీరు వల్లే తగ్గిపోయిన విస్తీర్ణం
- విత్తన కొరతపై దృష్టి సారించిన ప్రస్తుత ప్రభుత్వం
- 90 శాతం రాయితీపై పంపిణీతో సాగు పట్ల పెరుగుతున్న ఆసక్తి
- 4600 క్వింటాళ్లు చేపట్టిన వ్యవసాయశాఖ
- అనుకూలంగా వాతావరణం

చింతపల్లి : పాడేరు, రంపచోడవరం ఐటీడీఏల పరిధిలో 20 వేల హెక్టార్లలో రాజ్‌మా పంటను సాగు చేసేవారు. విత్తనాల కొరత వల్ల ప్రస్తుతం పాడేరు డివిజన్‌లో 10, 531 హెక్టార్లలో మాత్రమే రైతులు ఈ పంటను సాగు చేస్తున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి గిరాకీ ఉన్న రాజ్‌మా పంటను సాగు చేసేందుకు ప్రోత్సహించడంలో గత ప్రభుత్వాలు విఫలమయ్యాయి. గత ప్రభుత్వంలో సాగు సీజన్ ముగిసిన తరువాత విత్తనాలు పంపిణీ చేయడం వల్ల గిరి రైతులకు ఉపయోగం లేకుండా పోయింది. దళారులు రంగంలోకి దిగి రైతుల ద్వారా రాజ్‌మా విత్తనాలను కొనుగోలు చేసి బయట మార్కెట్‌కు తరలించేవారు.

ఈ ఏడాది సకాలంలో..

రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది సకాలంలో విత్తనాలు పంపిణీ చేపట్టింది. పట్టాదారు పాసు పుస్తకాలు తీసుకువచ్చిన రైతులకు మాత్రమే రైతు భరోసా కేంద్రాల్లో విత్తనాలు అందజేస్తూ విత్తనాలు పక్కదారి పట్టకుండా చర్యలు చేపట్టింది. మన్యంలో పండిన రాజ్‌మా చిక్కుళ్లను ముంబయి, పూణె, కర్ణాటక, మహారాష్ట్ర వంటి ప్రధాన రాష్ట్రాలకు ఎగుమతి చేస్తుంటారు. రాజ్‌మా చిక్కుళ్ల ధర కూడా కిలో రూ.60 నుంచి 70లు పలకడంతో రైతులు మంచి లాభాలు పొందేవారు.

నెలాఖరు వరకు అనుకూల వాతావరణం

నెలాఖరు వరకు ఈ పంటను సాగు చేసేందుకు వాతావరణం అనుకూలంగా ఉంటుందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం 90శాతం రాయితీపై జిల్లాలో 4600 క్వింటాళ్ల రాజ్‌మా విత్తనాలు పంపిణీ చేపట్టారు. ఎకరాకు 20 నుంచి 25 కిలోల విత్తనాలు అవసరం. ప్రభుత్వం 90 శాతం రాయితీపై 20 కిలోలను రూ.300కు విత్తనాలను పంపిణీ చేస్తోంది. సాగు చేపట్టిన రైతులు ఈక్రాప్ చేసుకోవాలని వ్యవసాయశాఖ ఏడీ జాహ్నవి సూచించాచరు. లేకుంటే వచ్చే ఏడాది వారికి విత్తనాలు సరఫరా చేయమని ఆమె తెలిపారు. ప్రస్తుతం విత్తనాల పంపిణీ ముమ్మరంగా సాగుతోంది.

అనువైన రకాలివే..

మన్యంలో చింతపల్లి రెడ్ 90 నుంచి 95 రోజులకు పంట దిగుబడి వస్తుంది. హెక్టారుకు 15 నుంచి 16 క్వింటాళ్ల దిగుబడి సాధించవచ్చు. చింతపల్లి వైట్ 80 నుంచి 85 రోజుల్లో పంట దిగుబడి వస్తుంది. హెక్టారుకు 14 క్వింటాళ్లు సాధించవచ్చు. రాజ్‌మా పంటలో ఎకరాకు 20 నుంచి 25 కిలోల విత్తనాలు అవసరం. రైతులు శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల సలహాలు తీసుకుని సాగు చేయాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

రాయితీని సద్వినియోగం చేసుకోవాలి



గిరిజన రైతులకు ప్రభుత్వం రాయితీ రూపంలో అందిస్తున్న ప్రోత్సాహకాన్ని సద్వినియోగం చేసుకోవాలి. జిల్లాలో రాజ్‌మా పంటకు మళ్లీ పూర్వ వైభవం రావాలి. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నందున మంచి దిగుబడి వచ్చే అవకాశం ఉంది. దళారుల దోపిడీకి గురికాకుండా విక్రయించి మంచి ఆదాయం పొందాలి.

– కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, పాడేరు ఎమ్మెల్యే.

అర్హులందరికీ విత్తనాలు



అర్హులైన రైతులకు 90శాతం రాయితీపై విత్తనాలు పంపిణీ చేస్తాం. పట్టాదారు పాసుపుస్తకం ఉండి సాగు చేస్తున్న గిరిజన రైతులకు వ్యవసాయశాఖ ద్వారా 90శాతం రాయితీపై విత్తనాలు పంపిణీకి చర్యలు చేపట్టాం. రాజ్‌మా ఎరుపు, తెలుపు విత్తనాలు జిల్లాకు 4600 క్వింటాళ్లు మొదటి విడత మంజూరయ్యాయి. సెలవు దినాలు మినహా ప్రతిరోజు ఆర్‌బీకేల్లో విత్తనాలు పంపిణీ జరుగుతోంది. ఒక్కో రైతుకు 20 కిలోల చొప్పున విత్తనాలు పంపిణీ చేస్తున్నాం.

– కంట జాహ్నవి, వ్యవసాయశాఖ ఏడీఏ, చింతపల్లి

న్యూస్‌రీల్

ఆరోగ్య జాగ్రత్తలతోనే క్షయ నివారణ



పీఎం క్షయ ముక్త్ కార్యక్రమాన్ని వర్చువల్ ద్వారా తిలకిస్తున్న ఎంపీ మాధవి

కొయ్యూరు: పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండి పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా క్షయ వ్యాధిని పూర్తిగా నివారించవచ్చునని అరకు ఎంపీ మాధవి తెలిపారు. శుక్రవారం రాష్ట్రపతి వర్చువల్ విధానంలో నిర్వహించిన ప్రధాన మంత్రి క్షయ ముక్త్ కార్యక్రమంలో పాల్గొన్నట్టు ఆమె పేర్కొన్నారు. క్షయ నిర్మూలనకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారని ఎంపీ తెలిపారు. మన్యంలో క్షయ కేసులు ఉన్నాయని చెప్పారు.

ఘాట్ రోడ్డులో రహదారిపైకి చుక్కల జింక



ఘాట్ రోడ్డులో చుక్కల జింక

మారేడుమిల్లి: మారేడుమిల్లి–చింతూరు ఘాట్ రోడ్డులో శుక్రవారం సాయంత్రం ఓ చుక్కల జింక రహదారిపైకి వచ్చింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి దారి తప్పి ఘాట్ మార్గంలోని అమృతధార జలపాతం సమీపంలో రోడ్డుపైకి వచ్చింది. రోడ్డు పక్కన చలికి వణుకుతూ ఉండగా అటువైపుగా వస్తున్న వాహనాదారులు ఆ జింకను గమనించి దానికి సపర్యలు చేసి తిరిగి అడవిలోకి పంపించారు.

దళారులను నమ్మి మోసపోవద్దు



సీఈ వెంకటేశ్వరరావు

మోతుగూడెం: చింతూరు మండల సీలేర్ కాంప్లెక్స్‌లో పరిధిలో తాత్కాలిక ఉద్యోగాలు ఇస్తామని దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని సీలేర్ కాంప్లెక్స్ ఏపీ జెన్‌కో ఇంచార్జీ చీఫ్ ఇంజనీర్ కె. వెంకటేశ్వరరావు సూచించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కొంతమంది దళారులు నిరుద్యోగులను నమ్మబలికి వారి నుంచి సొమ్ములు కాజేస్తున్న విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇప్పటికే కొంతమంది గిరిజన, గిరిజనేతరులు ఉద్యోగాల కోసం డబ్బులు ఇచ్చి మోసపోయినట్లు తమ వద్ద సమాచారం ఉందన్నారు. దీనిపై తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

భక్తిశ్రద్ధలతో జోల్డా పండగ



వంతాల గ్రామంలో సందడి చేస్తున్న గిరిజన రైతులు

జి.మాడుగుల: మండలంలోని వంతాల పంచాయతీ కేంద్రంలో జోల్డా పండగను గిరి రైతులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అటవీ ప్రాంతాల్లో లభించే కసిమి, జోల్డా,జీలుగు, సీత, తదితర ఔషధ మొక్కలను గిరిజనులు తీసుకువచ్చారు. వీటికి గిరిజన పూజారి శంఖు దేవుని వద్ద ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వాటిని రైతులు వారి పంటపొలాల్లో నాటారు. ఇలా చేయడం వల్ల పైరు చీడ పీడల బారిన పడకుండా ఆరోగ్యంగా ఉంటుందని వారు పేర్కొన్నారు. అనంతరం విందు భోజనాలు చేశారు. వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు కల్యాణం, గ్రామపెద్దలు, గిరిజనులు పాల్గొన్నారు.

12న అరకులో అప్రెంటిస్ మేళా

చింతపల్లి రూరల్: ఈ నెల 12న అరకు ప్రభుత్వ ఐటీఐలో అప్రెంటిస్ మేళా నిర్వహించనున్నట్లు చింతపల్లి ఆర్ ఐటీఐ ప్రిన్సిపాల్ రాజారావు తెలిపారు. ఈ మేళాను ఎలక్ట్రీషియన్, మోటార్ మెకానిక్, వెల్డర్ ట్రేడుల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

తెరిపివ్వని వాన

- జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు
- 300.8 ఎంఎం వర్షపాతం నమోదు



మారేడుమిల్లి మండలం కుండాడ, జీఎంవలస గ్రామాలకు వెళ్లే మార్గంలో పొంగి ప్రవహిస్తున్న కొండగెడ్డ వాగు



బొడ్డచెట్టు కాలనీ వద్ద కూలిన గెడ్డ రక్షణ గోడ



గన్నవరం వద్ద రహదారిపై కూలిన చింత చెట్టు

సాక్షి,పాడేరు : జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లోను శుక్రవారం కూడా వర్షం కురిసింది. జనజీవనానికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. పాడేరుతో పాటు అరకు వారపుసంతలకు వర్షం ఆటంకం కలిగించింది. జోరు వానతో సంతకు వచ్చిన గిరిజనులు, వ్యాపారులంతా ఇబ్బందులకు గురయ్యారు. ఘాట్ ప్రాంతాల్లోను వర్షం కురవడంతో వాహనచోదకులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వర్షాలతో ప్రధాన గెడ్డలు, వాగుల్లో వరద ఉధృతి నెలకొంది. జిల్లా వ్యాప్తంగా 300.8 ఎంఎం వర్షపాతం నమోదైంది. కలెక్టర్ సుమిత్‌కుమార్ రెవెన్యూ యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు.

వర్షపాతం వివరాలు : అరకులోయలో 42.6 మిల్లీమీటర్లు, డుంబ్రిగుడలో 35, అనంతగిరిలో 32.6 హుకుంపేటలో 29.4, పెదబయలులో 21.8, రంపచోడవరంలో 21.2, వీఆర్‌పురంలో 16.8, గంగవరంలో 16.2, పాడేరులో 12, రాజవొమ్మంగిలో 11.2, ముంచంగిపుట్టులో 10.4, దేవీపట్నంలో 9.4, జి.మాడుగులలో 7.2, కూనవరంలో 6.8, అడ్డతీగల 6.8, కొయ్యూరులో 5.2, చింతపల్లిలో 3.8, ఎటపాకలో 3.2, మారెడుమిల్లిలో 3.2, వై.రామవరంలో 2.4, జి.కె.వీధిలో 2, చింతూరులో 1.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని కలెక్టరేట్ అధికారులు తెలిపారు.

రహదారిపై కూలిన భారీ చెట్లు

ఎటపాక: వాయుగుండం ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. పెనుగాలులకు పలుచోట్ల రోడ్డుకు అడ్డంగా చెట్లు కూలిపోయాయి. భద్రాచలం నుంచి నెల్లిపాక వచ్చే జాతీయరహదారిపై వెంకటరెడ్డిపేట వద్ద భారీ వృక్షం రోడ్డుకు అడ్డంగా పడింది. కూనవరం ప్రధానరహదారిలో గన్నవరం వద్ద కూడా భారీ చింత చెట్టు కూలిపోయింది. వాహనాలు గంటల తరబడి నిలిచిపోయాయి. పోలీసులు స్పందించి గన్నవరం వద్ద కూలిన చింతచెట్టును శుక్రవారం ఉదయం తొలగించారు. భారీగా గోదావరిలోకి వరదనీరు చేరుతోంది.

అనంతగిరి: మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు గెడ్డలు, వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. మండల కేంద్రంలోని పర్యాటకశాఖ హరిత రిసార్ట్స్' వద్ద పీహెచ్‌సీ కాలనీకి అనుకుని ఉన్న గోడ కూలిపోయింది. బొడ్డచెట్టు కాలనీ వద్ద గెడ్డను అనుకుని నిర్మించిన రక్షణగోడ నేల కూలింది. దీనివల్ల గెడ్డలు పొంగి గ్రామాల్లోకి నీరు వచ్చే అవకాశం ఉందని గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. కూలిన రక్షణగోడను జెడ్పీటీసీ గంగరాజు పరిశీలించారు.



భారీ వర్షానికి కూలిపోయిన అన్నవరం పాత బ్రిడ్జి

భారీ వర్షానికి కూలిన అన్నవరం బ్రిడ్జి

వీఆర్‌పురం: ఎడతెరిపి లేకుండా శుక్రవారం కురిసి భారీ వర్షానికి అన్నవరం వాగుపై పాత బ్రిడ్జి కూలిపోయింది. రెండేళ్ల క్రితం ఈ బ్రిడ్జి శిథిలం కావడంతో రాకపోకలు సాగించేందుకు వాగుపై ఆర్అండ్‌బీ శాఖ అధికారులు గత ఏడాది తాత్కాలికంగా చప్టాను నిర్మించారు. కాగా అది కూడా మూడు నెలల క్రితం వర్షాలకు దెబ్బతింది. దీంతో పాత బ్రిడ్జిపైనే ఆటోలు, తేలికపాటి నాలుగు చక్రాల వాహనాలు రాకపోకలు సాగించేవి. భారీ వర్షానికి అదికూడా కూలిపోవడంతో మండల కేంద్రం రేఖపల్లికి సుమారు 20 గ్రామాల రాకపోకలు నిలిచిపోయాయి. అన్నవరం వాగుపై హైలెవెల్ వంతెన నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

భవన నిర్మాణాలు మరింత వేగవంతం

కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం



వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి, పాడేరు : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రభుత్వ ప్రాధాన్యత భవనాల నిర్మాణానికి అధిక ప్రాధాన్యమిచ్చి త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. శుక్రవా రం కలెక్టరేట్ నుంచి అన్ని మండలాల అధికారులతో వీడియో సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో 349 గ్రామ సచివాలయాల భవనాలు మంజూరు కాగా 38 నిర్మాణాలు పూర్తయ్యాయని, వివిధ దశల్లో ఉన్న మిగిలిన భవనాలను కూడా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశి ంచారు. 344 ఆర్‌బీకే కేంద్రాలకు 30 భవనాలు పూర్తి చేశామని, 81 భవనాలు చివరి దశలో ఉన్నాయని, మిగిలిన భవనాలన్నింటిని త్వరితగతిన పూర్తి చేయా లని ఆదేశించారు. వెల్‌నెస్ కేంద్రాల భవనాలపై కూడా ఇంజనీరింగ్ అధికారులు దృష్టి సారించాలని, జిల్లాకు మంజూరైన 21 బల్క్ మిల్క్ కూలింగ్ యూని ట్లను త్వరితగతిన ప్రారంభించాలని సూచించారు. కూనవరం, వీఆర్‌పురం, ఎటపాక మండలాల్లో 19 రైతు భరోసా కేంద్రాలు, 22 వెల్‌నెస్ కేంద్రాలు, 2 గ్రామ సచివాలయ భవన నిర్మాణాలు పలు సమస్యలతో ప్రారంభం కాలేదని, వాటిని కూడా వెంటనే ప్రారంభించాలని చింతూరు ఐటీడీఏ పీవో రామశేషును కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాడేరు, చింతూరు, రంపచోడవరం ఐటీడీఏల పీవోలు వారి స్థాయిలో భవన నిర్మాణ సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో 84లక్షల పని దినాలు కల్పించాలని, ఆయా కూలీలకు రూ.250 దినసరి వేతనం గిట్టుబాటు అయ్యేలా పనులు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డ్వామా పీడీ రమేష్ రామన్, పీఆర్ ఎస్ఈ లావణ్యకుమార్, పాడేరు, రంపచోడవరం, చింతూరు ఐటీడీఏ పీవోలు ఆర్.గోపాలకృష్ణ, సూరజ్ గనోరే, రామశేషు, అన్ని మండలాల ఎంపీడీవోలు పాల్గొన్నారు.

వ్యాధుల నియంత్రణకు చర్యలు

జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి సుజాత



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి సుజాత

చింతూరు: వరద ప్రభావానికి గురైన చింతూరు, కూనవరం, వీఆర్‌పురం, ఎటపాక మండలాల్లో వ్యాధుల నియంత్రణకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ సుజాత అన్నారు. వరదల అనంతరం నాలుగు మండలాల్లో వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో శుక్ర వారం అమె చింతూరు, ఎటపాక మండలాల్లో పర్యటించారు. చింతూరు మండలం తులసిపాక పీహెచ్‌సీ, ఏరియా ఆస్పత్రిని ఆమె సందర్శించారు. రోగులతో మాట్లాడారు. వైద్యసేవల గురించి ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాలుగు మండలాల్లో డెంగ్యూతో పాటు మలేరి యా, టైఫాయిడ్ జ్వరాలు ప్రబలకుండా ప్రతి గ్రామంలో వైద్య శిబిరాలు నిర్వహణకు ఆదేశించామన్నారు. రెండో విడత దోమలమందు పిచికారీ కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని, ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని క్రమం తప్పకుండా చేపట్టనున్నట్టు తెలిపారు. దోమతెరల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్టు చెప్పారు. అనంతరం ఆమె ఏరియా ఆస్పత్రిలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. గర్భిణులకు జాగ్రత్తలు, సూచనలు చేశారు. స్థానిక ఎస్టీ కాలనీలో జరుగుతున్న డ్రైడే –ఫ్రైడే కార్యక్రమాన్ని పరిశీలించారు. లార్వా నిర్మూలనపై తగు సూచనలు చేశారు. అనంతరం ఆమె చింతూరులో వైద్యశాఖ, ఐసీడీఎస్ సిబ్బందితో సమన్వయ సమావేశం నిర్వహించారు. కిశోర బాలికలకు ఐరన్‌ఫోలిక్ మాత్రలు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలని ఆమె సూచించారు. ఎటపాక మండలంలోని నెల్లిపాక, లక్ష్మీపురం పీహెచ్‌సీలను తనిఖీ చేసిన ఆమె టీబీ కేసులు, మందుల సరఫరా, స్టాకు వివరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్షయ నివారణాధికారి డాక్టర్ విశ్వేశ్వరనాయుడు, డిప్యూటీ డీఎం అండ్‌హెచ్‌వో డాక్టర్ పుల్లయ్య, ఐసీడీఎస్ సీడీపీవో విజయగౌరి పాల్గొన్నారు.

కస్తూర్బా విద్యార్థినుల ఆందోళన

- పాడేరు కేజీబీవీలో నాణ్యమైన మెనూ అమలు చేయలేదని ఆరోపణ
- ప్రత్యేకాధికారిని బదిలీ చేయాలని డిమాండ్



బైఠాయించిన కస్తూర్బా విద్యార్థినులు

సాక్షి, పాడేరు : స్థానిక కస్తూర్బా విద్యాలయం ప్రత్యేకాధికారిని బదిలీ చేయాలని, పూర్తిస్థాయిలో మెనూ అమలు చేయాలని గిరిజన విద్యార్థినులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఉదయం వీరంతా కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఉదయం అందించిన ఫలహారం నాణ్యతగా లేదని, మౌలిక సదుపాయాలకు కూడా నోచుకోవడం లేదని ఆరోపించారు. ఒక వైపు వర్షం కురుస్తున్నా లగేజీ బ్యాగులతో నినాదాలు చేసుకుంటూ కలెక్టర్ కార్యాలయానికి వచ్చారు. ఆ సమయంలో విధులు నిర్వహిస్తున్న పీఈటీ, నైట్ డ్యూటీ చేసిన మరో సీఆర్‌టీ ఉపాధ్యాయిని ఆ విద్యార్థినులను అడ్డగించినప్పటికీ ఫలితం లేకపోయింది. ఏబీవీపీ, ఎస్ఎఫ్ఐ, ఇతర సంఘాల నేతల ఆధ్వర్యంలో తమ న్యాయ సమ్మతమైన సమస్యలు పరిష్కరించాలని కోరారు.సీఐ సుధాకర్, ఎస్ఐ లక్ష్మణరావు, ఏటీడబ్ల్యూవో ఎల్.రజిని, ఎంఈవో సరస్వతిదేవిలు కలెక్టరేట్‌కు వచ్చారు. విద్యార్థినులతో చర్చలు జరిపారు. నాణ్యమైన ఆహారం అందడం లేదని, అర్థికపరమైన వేధింపులు కూడా అధికమయ్యాయని, ప్రత్యేకాధికారిపై చర్యలు తీసుకోవాలని విద్యార్థినులు డిమాండ్ చేశారు. లేకుంటే ఇళ్లకు వెళ్లిపోతామని వారు స్పష్టం చేశారు. ఏటీడబ్ల్యూవో ఎల్.రజిని వారితో చర్చించారు. కలెక్టర్, ఐటీడీఏ పీవో, ఇతర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

సమగ్ర విచారణకు కలెక్టర్ ఆదేశం

విద్యార్థినుల ఆందోళనపై కలెక్టర్ సుమిత్‌కుమార్ స్పందించారు. విద్యార్థినులు కేజీబీవీ నుంచి బయటకు రావడంపై ఆ సమయంలో విధులు నిర్వహిస్తున్న పీఈటీ, సీఆర్‌టీ, ఇతర సిబ్బందిని విచారించాలని ఆయన సూచించారు. ప్రత్యేకాధికారి, ఇతర సిబ్బందిపై కూడా కలెక్టర్ విచారణకు ఆదేశించారు. విద్యార్థినులను నిలువరించేందుకు ప్రయత్నించినా వారు లక్ష్యపెట్టలేదని పీఈటీ ఎం.వెంకటలక్ష్మి కలెక్టర్‌కు నివేదించారు. అనంతరం కలెక్టర్ పీఈటీ, ఏటీడబ్ల్యూవో ఎల్.రజినిలను విచారించారు. ఉద్దేశపూర్వకంగా, కుట్రపూరితంగా విద్యార్థినుల ఆందోళనకు కారణమైన వారిని ఉపేక్షించేది లేదని, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరపాలని డీఈవో డాక్టర్ రమేష్‌కు సూచించారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాల మేరకు డీఈవో డాక్టర్ రమేష్ కేజీబీవీ పాఠశాలను సందర్శించి సమగ్ర విచారణ చేపట్టారు. దీనిలో భాగంగా ఆయన విద్యార్థినులతో సమావేశమయ్యారు. విద్యాలయం పనితీరుపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన ఆహారం అందకపోవడం వల్లే వారు ఆందోళనకు దిగారని, దీనిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామన్నారు. ఈవిషయంలో విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని డీఈవో స్పష్టం చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గిరిజన సంక్షేమ కార్యాలయం సూపరింటెండెంట్ శ్రీనివాస్ రెడ్డిని విచారణ అధికారిగా నియమించామని, ఆయన ఆధ్వర్యంలో జరిగిన సంఘటనపై విచారణ జరుగుతుందన్నారు. వారం రోజుల్లో విచారణ జరిపి పూర్తిస్థాయిలో నివేదిక అందజేస్తారని డీఈవో పేర్కొన్నారు.



జైజై గణేశా..!

మండలంలోని ఏనుగురాయి పంచాయతీ జంగంసరియా గ్రామంలో వినాయక నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. థింసా నృత్యం, మందుగుండు కాల్పులతో అట్టహాసంగా ఊరేగింపు నిర్వహించారు. సర్పంచ్ నర్సింగరావు, ఎంపీటీసీ సుబ్బలక్ష్మి ఆధ్వర్యంలో ఉత్సవ కమిటీ సుజనకోట వద్ద మత్స్యగెడ్డలో నిమజ్జనం చేశారు. లడ్డూకు వేలం పాట నిర్వహించారు.

- ముంచంగిపుట్టు

క్లుప్తంగా

షటిల్ క్రీడాకారుడికి అభినందన


క్రీడాకారుడు సూర్యను సత్కరిస్తున్న కలెక్టర్, ఐటీడీఏ పీవో

సాక్షి,పాడేరు : ఇటీవల అండర్–14 విభాగంలో జాతీయ క్రీడల్లో ప్రతిభ కనబర్చి రెండు బంగారు, రెండు వెండి పతకాలను సాధించిన షటిల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు కమిడి సూర్యను కలెక్టర్ సుమిత్‌కుమార్, జాయింట్ కలెక్టర్ జె.శివ శ్రీనివాస్, ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ అభినందించారు. శుక్రవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో అరకులోయ గిరిజన గురుకుల క్రీడా పాఠశాలకు చెందిన కమిడి సూర్యను శాలువా కప్పి సత్కరించారు. అనంతగిరి మండలానికి చెందిన సూర్య అరకులోయ క్రీడా పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్నాడు. ఇటీవల నేపాల్, గోవా ప్రాంతా ల్లో జరిగిన జాతీయ క్రీడా పోటీల్లో బంగారు, వెండి పతకాలు కైవసం చేసుకున్నాడు. సూర్య ను రాష్ట్ర షటిల్ బ్యాడ్మింటన్ అకాడమిలో చేర్పించాలని తండ్రి రాజుకుమార్ కలెక్టర్‌ను కోరాడు.

అత్యాచారయత్నం కేసులో నిందితుడి అరెస్టు

రాజవొమ్మంగి : వాతంగిలో మైనర్ బాలికపై అత్యాచార యత్నానికి పాల్పడిన యువకుణ్ణి అరెస్టు చేసినట్లు సీఐ రవికుమార్, జడ్డంగి ఇన్‌చార్జ్ ఎస్‌ఐ గోపీ నరేంద్రప్రసాద్ ఒక ప్రకటనలో శుక్రవారం తెలిపారు. ఈ ఘటనలో నిందితుడిపై ఈనెల 6వ తేదీన జడ్డంగి స్టేషన్‌లో పోక్సో కేసు నమోదైన సంగతి విదితమే. ఈ కేసుకు సంబంధించి అదే గ్రామానికి చెందిన నిందితుడు రెడ్డి బాలమురళి (28)ని అరెస్టు చేసి అడ్డతీగల మెజిస్ట్రేట్ కోర్టు ఎదుట హాజరుపరిచామన్నారు.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి

జిల్లా వ్యవసాయాధికారి నందు


రంపచోడవరంలో రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న అధికారులు నందు, రమేష్


దేవీపట్నంలో మాట్లాడుతున్న ఏడీఏ విశ్వనాథ చౌదరి

అడ్డతీగల: అల్లూరి జిల్లా రంపచోడవరం నియోజకవర్గంలో రంపచోడవరం, అడ్డతీగల, గంగవరం మండలాల్లో వ్యవసాయాధికారి ఎస్.బి.ఎస్.నందు శుక్రవారం విస్తృతంగా పర్యటించారు. ఆయా గ్రామాల్లోని పంటలను పరిశీలించారు. ఈ–పంట నమోదు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఇందులో భాగంగా అడ్డతీగలలో ఆయన రైతులతో మాట్లాడుతూ ఈ–క్రాప్ నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు. ప్రతి రైతు ఈ–కేవైసీ చేయించుకునేలా వీఆర్వోలతో సమన్వయం చేసుకుని కార్యక్రమాన్ని పూర్తిచేయాలన్నారు. వ్యవసాయ, ఉద్యానవన సహాయకులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. వ్యవసాయ, ఉద్యాన వన శాఖ అమలుచేస్తున్న పథకాలపై అవగాహన కల్పించారు.పంటల రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రభుత్వ లక్ష్యాల మేరకు పనిచేయాలని సిబ్బందికి సూచించారు. పొలంబడి, తోటబడి వంటి కార్యక్రమాలపై వివరించారు.వేటమామిడిలో ఈ–క్రాప్ నమోదు కార్యక్రమాన్ని స్వయంగా చేయించారు. ఎడిఎ కె.సావిత్రి, ఎఎస్‌ఓ శ్రీనివాస్, వ్యవసాయాధికారి చక్రధర్ తదితరులున్నారు.

రంపచోడవరం: మండలంలోని ఐ.పోలవరం ఆర్‌బీకేని జిల్లా ఉద్యాన శాఖాధికారి రమేష్‌తో కలిసి జిల్లా వ్యవసాయాధికారి నందు సందర్శించారు. రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. పీఎం కిసాన్ పథకంపై రైతులకు అవగాహన కల్పించారు. తోటబడి కార్యక్రమం సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. ఏవోలక్ష్మణరావు, ఉద్యాన శాఖ అధికారి రమేష్ తదితరులున్నారు.

గంగవరం: మండల పరిషత్ కార్యాలయంలో వ్యవసాయ సలహా మండలి సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి నందు పాల్గొన్నారు. రైతుల సమస్యలపై చర్చించారు. సూరంపాలెం, భూపతిపాలెం రిజర్వాయర్ పరిధిలో కాలువలకు మరమ్మతులు చేయించి సాగునీరు అందించాలని కోరారు. విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కరిస్తామన్నారు. అనంతరం ఉద్యాన పంటల పథకాలను జిల్లా ఉద్యాన అధికారి రమేష్ రైతులకు వివరించారు. జెడ్పీటీసీ సభ్యురాలు బీబీరత్నం, వైస్ ఎంపీపీ గంగాదేవి, వ్యవసాయ సహాయ సంచాలకులు సావిత్రి, ఏఎస్‌వో శ్రీనివాస్, ఏవో విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

దేవీపట్నం: ఇందుకూరుపేట ఆర్‌బీకేలో వ్యవసాయ సలహా మండలి సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా రంపచోడవరం ఏడీఏ విశ్వనాథ చౌదరి మాట్లాడుతూ రైతులు రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలన్నారు. రైతు భరోసా, పీఎం కిసాన్ పథకాల కోసం రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏవో ఎస్.జెన్నీ తదితరులు పాల్గొన్నారు.

'స్పందన' సమస్యలు సత్వరమే పరిష్కారం

- కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం
- 105 వినతుల స్వీకరణ

సాక్షి, పాడేరు : గిరిజన ప్రాంతాల్లో సమస్యలపై స్పందనలో గిరిజనుల నుంచి వచ్చిన వినతులను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో శుక్రవారం స్పందన కార్యక్రమాన్ని కలెక్టర్ నిర్వహించారు. వివిధ మండలాల నుంచి వచ్చిన గిరిజనుల నుంచి 105 వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ స్పందనలో వినతులకు సత్వరమే పరిష్కారం చూపాలన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యేలు సూచించిన పనులకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ప్రతి సచివాలయానికి రూ.20లక్షల నిధులు మంజూరు చేసిందని, సచివాలయం పరిధిలో గుర్తించిన పనులకు అంచనాలు సిద్ధం చేసి వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్, ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ, డీఆర్‌వో బి.దయానిధి, గిరిజన సంక్షేమ డీడీ ఐ.కొండలరావు, పలు శాఖల ఇంజనీరింగ్ అధికారులు డీవీఆర్‌ఎం రాజు, కొండయ్యపడాల్, లావణ్యకుమార్, బాలసుందరబాబు, డీఎల్పీవో పీఎస్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వినతుల వివరాలు.. : పెదలోచలి గ్రామానికి చెందిన బోయ కోటిలింగం తన పట్టా నంబర్ 9లోని 11.65 ఎకరాల భూమిని తమ కుమారుల పేరుపై బదిలీ చేసి పట్టాలు మంజూరు చేయాలని కోరారు.

- పెదబయలు మండలం గిన్నెలకోట పంచాయతీ గబ్బరామిడి గ్రామానికి చెందిన 16 కుటుంబాల గిరిజనులు సాగు చేస్తున్న భూములకు అటవీ హక్కు పత్రాలు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు.
- చింతపల్లి మండలం తాజంగి పంచాయతీ వంతమామిడికి చెందిన బొబ్బిలి బాలమ్మ వితంతు పింఛను మంజూరు చేయాలని కలెక్టర్‌ను కోరింది.
- జి.కె.వీధి మండలం ఇంద్రనగర్‌కు రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించాలని, చింతపల్లి మండలం ఎర్రబొమ్మల పంచాయతీ కొండవంచుల, ఎర్రబంద గ్రామస్తులు చినబరడ వరకు రోడ్డు నిర్మించాలని కోరారు.
- చింతపల్లి మండల కేంద్రంలోని ముత్యాలమ్మ సతకంపట్టు, రామాలయం సకలదేవతల గుడి, సాయినగర్‌లో వాటర్‌ప్లాంట్ నిర్మించి తాగునీటి సౌకర్యాలను అందుబాటులో తేవాలని చింతపల్లి ఎంపీటీసీ డి.దారాలమ్మ విన్నవించారు.
- పాడేరు మండలం సలుగు పంచాయతీ బూరుగుచట్టులో నిర్మిస్తున్న జియో టవర్ నిర్మాణాన్ని వేరే ప్రాంతానికి మార్చాలని గిరిజనులు డి.సత్యారావు, రంగారావు వినతి పత్రంలో పేర్కొన్నారు.

జాబ్ మేళాలో పది మంది ఎంపిక


ఇంటర్వ్యూ చేస్తున్న నైపుణ్యాభివృద్ధి సంస్థ, అరబిందో ఫార్మా ఫౌండేషన్ ప్రతినిధులు

అడ్డతీగల: ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక వైటీసీలో నిర్వహించిన జాబ్ మేళాకు 23 మంది గిరిజన యువతీ యువకులు హాజరు కాగా 10 మంది ఎంపికయ్యారని నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి పి.రోహిణి తెలిపారు. ఇండస్ట్రియల్ కస్టమైజ్డ్ స్కిల్ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ పేరిట నిర్వహించిన డ్రైవ్‌లో ఆసక్తి గల యువతీ యువకుల ఎంపిక చేపట్టామని ఆమె పేర్కొన్నారు. అరబిందో ఫార్మా ఫౌండేషన్ ప్రతినిధులు, నైపుణ్యాభివృద్ధి సంస్థ కోఆర్డినేటర్ ఆనంద్‌బాబు, ప్లేస్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ ఎం.సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

271 కిలోల గంజాయి స్వాధీనం

- జీపు, రెండు పల్సర్ బైకులు స్వాధీనం
- పోలీసుల అదుపులో ఇద్దరు నిందితులు, మరో ఆరుగురు పరార్


పట్టుబడ్డ గంజాయి, జీపు, నిందితులతో సీఐ సత్యనారాయణ

పెదబయలు : అడుగులపుట్టు పంచాయతీ సరిహద్దులో శుక్రవారం ఉదయం జీపులో తరలిస్తున్న 271 కిలోల గంజాయిని పట్టుకున్నట్టు జి.మాడుగుల సీఐ సత్యనారాయణ, స్థానిక ఎస్.మనోజ్‌కుమార్ తెలిపారు. వారు తెలిపిన వివరాలివి. ముంచంగిపుట్టు మండలం కుజభంగి నుంచి పెదబయలు వంతెన మీదుగా ఒడిశా పాడువ ప్రాంతానికి జీపులో గంజాయి తరలిస్తుండగా ముందస్తు సమాచారంతో అడుగులపుట్టు పంచాయతీ సంపంగిపుట్టు సమీపంలో జీపు ఆపి తనిఖీ చేశామని తెలిపారు. జీపులో 271 కిలోల గంజాయి గుర్తించి, జీపుతో పాటు రెండుబైకులు స్వాధీనం చేసుకున్నామన్నారు. గంజాయి తరలిస్తున్న పెదబయలు మండలం కుంతుర్ల పంచాయతీకి చెందిన పలాసి రాజేష్, పాడేరు మండలానికి చెందిన కుంజం రామేష్‌లను అదుపులోకి తీసుకోగా, మరో ఆరుగురు నిందితులు పరారయ్యారని తెలిపారు. పట్టుబడ్డ గంజాయి విలువ రూ.5.42 లక్షలు ఉంటుందని, వాహనాలు సీజ్ చేసి నిందితులను రిమాండ్‌కు తరలించామని తెలిపారు.

బాల్య వివాహాలను వ్యతిరేకించాలి


కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలిసిన పడాల చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు

సాక్షి, పాడేరు : బాల్య వివాహాలు అమానుషమని, మహిళలందరూ బాల్య వివాహాలను వ్యతిరేకించాలని, రుతుస్రావంలో మూఢనమ్మకాలను విడనాడాలని పడాల చారిటబుల్ ట్రస్టు ప్రతినిధి రాజ్యలక్ష్మి అన్నారు. మండలంలోని గుత్తులపుట్టు ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలలో జిల్లా యంత్రాంగం సహకారంతో పడాల ట్రస్టు ఆధ్వర్యంలో బాల్యవివాహాలు, రుతుస్రావంపై శుక్రవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యుక్త వయస్సు రాని ఆడపిల్లలలో మానసిక పరిపక్వత ఉండదని, తద్వారా అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. బాల్య వివాహాలకు బాలికలు దూరంగా ఉండాలని సూచించారు. కేర్ ఇండియా సంస్థ, జిల్లా యంత్రాంగం సహకారంతో ఈ నెల 6నుంచి 9వ తేదీ వరకు పలు బాలికల పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థినులకు ఆరోగ్యం, లైంగిక వేధింపులు, తదితర అంశాలపై అవగాహన కల్పించినట్టు చెప్పారు. అనంతరం కలెక్టర్ సుమిత్ కుమార్‌ను కలిసి జిల్లా యంత్రాంగం సహకారం అందించడంపై కృతజ్ఞతలు తెలిపారు. ట్రస్టు రిసోర్స్ పర్సన్ పద్మావతి, వంశీకృష్ణ, సూర్యప్రసాద్, హెచ్‌ఎంలు, కేర్ ఇండియా ప్రతినిధి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

సిగినాపల్లి క్వారీలో రంగురాళ్ల తవ్వకాలు

రూ.30 లక్షల మేర లావాదేవీలు


సిగినాపల్లి క్వారీలో తవ్వుతున్న కూలీలు

గూడెంకొత్తవీధి : మండలంలోని దామనాపల్లి పంచాయతీ సిగినాపల్లి, సంకాడ అటవీ ప్రాంతాల్లో రంగురాళ్ల తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. వారం రోజులుగా గుట్టు చప్పుడు కాకుండా జరుగుతున్న ఈ తవ్వకాల్లో సుమారు రూ.30 లక్షల మేర లావాదేవీలు జరిగినట్లు తెలుస్తోంది. సిగినాపల్లి క్వారీలో గతంలో భారీ సొరంగంలో చిక్కుకుని నలుగురు గిరిజను లు ప్రాణాలు కోల్పోవడం తెలిసిందే. అప్పటి నుంచి ఈ రంగురాళ్ల క్వారీలో తవ్వకాలు జరగకుండా అటవీ, పోలీసు శాఖలు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాయి. చింతపల్లి డివిజన్ ఫారెస్టు పరిధిలో గుట్టు చప్పుడు కాకుండా చింతపల్లికి చెందిన బడా వ్యాపారులు సిగినాపల్లికి చెందిన కొందరు గిరిజనులకు డబ్బులు ఎర చూపడంతో పాటు భోజనం, మద్యం ఏర్పాటు చేస్తున్నట్లు సమాచారం. దీంతో వారం రోజులుగా ఈ క్వారీలో తవ్వకాలు జరుగుతున్నాయి. పెద్ద సొరంగాలు ఏర్పడ్డాయి. దీనిపై చింతపల్లి డిప్యూటీ రేంజ్ అధికారి వెంకటరాజు వివరణ కోరగా రంగురాళ్ల తవ్వకాలు జరగకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. సిగినాపల్లి క్వారీలో తవ్వకాలు చేపడితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

సీలేరులో పర్యాటకుల సందడి


సీలేరులోని జలపాతం వద్ద సందడి చేస్తున్న పర్యాటకులు

సీలేరు : హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో నుంచి వచ్చిన పర్యాటకులు అరకులోయతో పాటు ఏజెన్సీలో పలు పర్యాటక ప్రాంతాలు వీక్షించేందుకు వాహనాలపై సీలేరు వచ్చారు. సుమారు 22 ద్విచక్రవాహనాల్లో మారెడుమిల్లి, పొల్లూరు జలపాతం, సీలేరు జలాశయం వద్ద సందడి చేశారు. అనంతరం సీలేరులోని ఐస్‌గెడ్డ జలపాతం వద్ద జలకాలాడారు. సుమారు 800 కిలోమీటర్ల మేర పర్యాటక ప్రాంతాలను సందర్శిస్తు వారం రోజుల పాటు ఈ యాత్ర చేపట్టినట్టు వారు తెలిపారు.

ఉపాధ్యాయుల గైర్హాజరుపై విచారణ


గ్రామస్తుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న హెచ్‌ఎం నీలకంఠేశ్వరరావు, సీఆర్‌పీ ఈశ్వరరావు

ముంచంగిపుట్టు: లక్ష్మీపురం పంచాయతీ దొరగూడ, ఉబ్బెంగుల గ్రామాల్లో పాఠశాలల ఉపాధ్యాయుల గైర్హాజరుపై ఐటీడీఏ పీవో, ఎంఈవో చెల్లయ్య ఆదేశాల మేరకు క్లస్టర్ హెచ్‌ఎం ఎల్.నీలకంఠేశ్వరరావు, సీఆర్‌పీ ఈశ్వరరావు శుక్రవారం ఆయా గ్రామాల్లో పర్యటించారు. ఉపాధ్యాయులను విచారించి, గ్రామస్తుల నుంచి వివరాలు సేకరించారు. విచారణలో భాగంగా ఉబ్బెంగుల ఉపాధ్యాయుడు ఆనంద్, గ్రామస్తులు మాట్లాడుతూ కోడాపుట్టు పాఠశాల నుంచి డిప్యూటేషన్‌పై నియమించారని, అయితే సర్పంచ్ త్రినాథ్ గ్రామంలో పర్మినెంట్ టీచర్ నియామకం కోసం ఇటీవల స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారని, దీంతో తాను రావడం లేదని పేర్కొన్నారు. దొరగూడ ఉపాధ్యాయుడు పి.డొంబును విచారించగా తాను రోజూ పాఠశాలకు వస్తున్నానని, వర్షాలు పడి బెరిగూడ, ఉబ్బెగుల గెడ్డలు పొంగితే రాలేకపోతున్నాని, గ్రామస్తుల సమక్షంలో వివరణ ఇచ్చారు. విచారణ నివేదికను పీవో, ఎంఈవోలను నివేదిస్తామని హెచ్‌ఎం నీలకంఠేశ్వరరావు చెప్పారు. దొరగూడ వెళ్లేందుకు హెచ్‌ఎం, సీఆర్‌పీలు బెరిగూడ, ఉబ్బెగుల గెడ్డలు దాటుకొని, 10 కిలోమీటర్లు కాలినడకన వెళ్లడం విశేషం.

నిల్వ మాంసం తినడంతో తొమ్మిది మందికి అస్వస్థత

- ఒకరి పరిస్థితి విషమం

చింతపల్లి రూరల్: మండలంలోని కొమ్మంగి పంచాయతీ గెంజిగెడ్డ గ్రామంలో నిల్వ మాంసం తినిన తొమ్మిది గిరిజనులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. చింతపల్లి వారపు సంతలో గెంజిగెడ్డ గ్రామస్తులు బుధవారం నిల్వ మాంసాన్ని కొనుగోలు చేసినట్టు సమాచారం. గురువారం తినడంతో తొమ్మిది మంది విరోచనాలతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వీరిని పంచాయతీ కార్యదర్శి శ్రీను, ఏఎన్‌ఎం లంబసింగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్యాధికారి మారమ్మ తక్షణ వైద్యం అందించారు. వ్యాధి బారిన పడిన వారిలో ప్రసాద్ అనే వ్యక్తి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. దీంతో అతనిని నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించినట్టు వైద్యాధికారి తెలిపారు. ఈ నేపథ్యంలో గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటుచేయాలని ఎంపీడీవో లాలం సీతయ్య ఆదేశించారు.

జనరేటర్ బెల్ట్ తగిలి మహిళ మృతి

మాకవరపాలెం : వినాయక నిమజ్జన ఊరేగింపులో అపశృతి చోటుచేసుకుంది. జనరేటర్ బెల్ట్ తగిలి ఒక మహిళ మృతి చెందింది. జంగాలపల్లిలో గురువారం రాత్రి వినాయక నిమజ్జనోత్సవం సందర్భంగా ఊరేగింపు తిలకిస్తున్న చిత్రాడ పరిదేశమ్మ(45) చీర ప్రమాదవశాత్తూ జనరేటర్ బెల్ట్‌కు తగిలి చిక్కుకుంది. దీంతో తీవ్రంగా గాయపడిన పరిదేశమ్మను నర్సీపట్నం ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందింది. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

11 తులాల చోరీ బంగారం స్వాధీనం

- నిందితుడికి రిమాండ్
- విలేకర్ల సమావేశంలో డీఎస్పీ శ్రీనివాసరావు వెల్లడి


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ పి.శ్రీనివాసరావు

అనకాపల్లి టౌన్ : జల్సాలకు అలవాటు పడి పలు చోరీలకు పాల్పడిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్టు ఎస్సీ, ఎస్టీ సెల్, పరవాడ సర్కిల్ ఇన్‌చార్జి డీఎస్పీ పి.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక పోలీస్ గెస్ట్‌హౌస్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన వివరాలు తెలిపారు. పట్టణంలో లక్ష్మీదేవిపేటకు చెందిన ఒడిశెట్టి నూకరాజు వృత్తిరీత్యా కశింకోట గ్రామంలో పాలసెంటర్ నిర్వహిస్తున్నాడని తెలిపారు. మద్యానికి బానిసైన నూకరాజు తన భార్య నుంచి కొంత బంగారాన్ని ప్రైవేటు గోల్డ్ కంపెనీల్లో తాకట్టు పెట్టి, ఆ డబ్బును జల్సాగా ఖర్చుచేశాడని తెలిపారు. దీంతో భర్త దురలవాట్లను గ్రహించిన భార్య పుట్టింటికి వెళ్లిపోవడంతో నూకరాజు చోరీలకు పాల్పడుతున్నట్టు తెలిపారు. ఈ ఏడాది జూలై 2 వతేదీన మునగపాక మండలం ఉమ్మలాడ శివారు ఒక ఫాంహౌస్‌లో దొంగతనానికి పాల్పడడంతో పాటు అక్కడే ఉన్న ఇంట్లో చొరబడి ఇద్దరు మహిళల మెడలో ఉన్న 8 తులాల బంగారు వస్తువులు చోరీ చేశాడని, ఈనెల 5వతేదీన అనకాపల్లి మండలం సంపతిపురం పంచాయతీ టి.వెంకుపాలెం శివారు గ్రామంలో ఒక మహిళ మెడ నుంచి మూడుతులాల బంగారు పుస్తెలతాడు దొంగిలించాడని తెలిపారు. ఆయా చోరీ కేసుల్లో నిందితుడిని పట్టుకోవడానికి యలమంచిలి, మునగపాక, కశింకోట పోలీసులకు పట్టణ సీసీఎస్ పోలీసులు తోడై విస్తృత గాలింపు చర్యలు చేపట్టారని, ఉమ్మలాడ గ్రామం వద్ద ద్విచక్రవాహనంపై వస్తున్న నూకరాజును అనుమానంతో అదుపులోకి తీసుకుని విచారించగా నేరాలను అంగీకరించాడని తెలిపారు. ఈ మేరకు నిందితుడిని కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్టు డీఎస్పీ చెప్పారు. సమావేశంలో యలమంచిలి సీఐ షేక్ గఫూర్, సీసీఎస్ క్రైం సీఐ బి.వి.జె.రాజు, ఎస్‌ఐలు జి.ఉమామహేశ్వరరావు, సత్యనారాయణ, సీహెచ్.నర్సింగరావు, భీమరాజు, విశ్వేశ్వరరావు, ఏఎస్‌ఐలు అప్పారావు, పరమేశ్వరరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యార్థులకు కంటి పరీక్షలు



పరీక్షిస్తున్న వైద్యులు

డుంబ్రిగుడ: అరకు సంతబయలు సమీపంలోని ట్రైబల్ ఎడ్యుకేషనల్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సమక్షంలో కలెక్టర్ సుమిత్‌కుమార్, పాడేరు ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ ఆదేశాల మేరకు అనాథ పాఠశాలలో 120 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు చేశారు. కంటి జాగ్రత్తలను వివరించారు. ప్రతినిధులు వెంకటరావు, రాజు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారి వైద్యానికి చేయూత



బాలుడి కుటుంబానికి ఆర్థిక సాయమందిస్తున్న ఉపాధ్యాయులు

రాజవొమ్మంగి: గుండె సమస్యతో బాధపడుతున్న బాలునికి స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయులు శుక్రవారం రూ.12 వేల నగదును అందజేశారు. స్థానిక కమ్మరిపేటకు చెంది నాలుగవ తరగతి చదువుతున్న విద్యార్థి చీడి ఆకాష్ గత కొంతకాలంగా హృద్రోగంతో బాధపడుతున్న విషయం తెలిసిందే. కాగా నిరుపేద కుటుంబానికి చెందిన ఆ బాలుడి శస్త్ర చికిత్స నిమిత్తం ఉపాధ్యాయులు సాయం అందజేశారు. త్వరగా కోలుకోవాలని అకాంక్షించారు.

ఎంపీడీవోగా ప్రభాకరం బాధ్యతల స్వీకరణ



ముంచంగిపుట్టు: ముంచంగిపుట్టు ఎంపీడీవోగా డి.సీహెచ్. ప్రభాకరం శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీవోగా పని చేసిన ఎ.వి.వి. కుమార్ విశాఖ జిల్లా పరిషత్ కార్యాలయంలో పరిపాలన అధికారిగా వెళ్లారు. ఎంపీడీవో ప్రభాకరం మాట్లాడుతూ మండల అభివృద్ధికి నిరంతరం పనిచేస్తానని, ప్రజలందరూ సహకరించాలని కోరారు. సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

నాడు-నేడు పనులు వేగవంతం



మాట్లాడుతున్న ఎంఈవో రామచంద్రరావు

హుకుంపేట: స్థానిక ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో హెచ్‌ఎంలు, ఇంజినీరింగ్ అధికారులతో ఎంఈవో రామచంద్రరావు శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నాడు-నేడు రెండో విడతలో పాఠశాలల్లో చేపడుతున్న పనుల్లో నాణ్యత, ప్రమాణాలు పాటించాలని, పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. మెటీరియల్ బిల్లులను వెంటనే అప్‌లోడ్ చేయాలని సూచించారు. మండల ఇంజినీరింగ్ అధికారి ధ్రువకుమార్, ఏటీడబ్ల్యూవో రజిని, సీడీపీవో బాలచంద్రమణి దేవి తదితరులు పాల్గొన్నారు.


నిర్మాణ పనుల పరిశీలన



నాడు నేడు పనులు పరిశీలిస్తున్న జెడ్పీటీసీ బాలయ్య:

చింతపల్లిరూరల్: స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య శుక్రవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యమిస్తోందదన్నారు. నాడు-నేడు ద్వారా మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్టు చెప్పారు. పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. సర్పంచ్ దురియా పుష్పలత, పాఠశాల సిబ్బంది ఉన్నారు.

అర్హులందరికీ పథకాలు



హుకుంపేటలో వలంటీర్లతో మాట్లాడుతున్న ఎంపీపీ రాజుబాబు

హుకుంపేట: మండల కేంద్రంలో శుక్రవారం తీగలవలస, బూర్జ పంచాయతీలకు చెందిన గ్రామ వలంటీర్లతో ఎంపీపీ కూడా రాజుబాబు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా పనిచేయాలని సూచించారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ సంక్షేమ పథకాలు



పెదలంకలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి

- పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి

జి.మాడుగుల: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అమలుచేస్తూ, సుపరిపాలన అందిస్తోందని అల్లూరి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షురాలు, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. జి.మాడుగుల-2 గ్రామ సచివాలయ పరిధిలోని ఉరుము, గూపిగెడ్డ, పెద్దలంక గ్రామాల్లో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ఆయా గ్రామాల్లో 116 గడపలను ఆమె సందర్శించారు. ఎమ్మెల్యే భాగ్యలక్ష్మికి ఆయా గ్రామాల్లో గిరిజన మహిళలు పూలమాలలు వేసి హారతులిచ్చి ఘనంగా సన్మానించారు. గ్రామాల్లో సమస్యలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో తాగునీరు, రోడ్ల సమస్యను, ఆశ వర్కర్‌ను నియమించాలని పలువురు ఆమెను విన్నవించారు. అధికారులకు తెలియజేసి, సమస్యలు త్వరలో పరిష్కరిస్తానని ఆమె హామీ ఇచ్చారు. చేయూత పథకం ద్వారా వచ్చిన సొమ్ముతో చిరు వ్యాపారాలు చేసుకొని ఉపాధి పొందుతున్నట్టు లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ప్రజా సంక్షేమమంతో పాటు అభివృద్ధికి సమ ప్రాధాన్యం ఇస్తూ రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నారన్నారు. పాడేరు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ మత్స్యరాస గాయత్రి, వైస్ ఎంపీపీ కె.సత్యనారాయణ, మండల సర్పంచ్‌ల ఫోరం గౌరవ అధ్యక్షుడు, అధ్యక్షుడు రాంబాబు, రామకృష్ణ, ఎంపీటీసీలు సన్యాసిదొర, చిన్నారావు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి మత్స్యకొండంనాయకుడు, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు నాగూర్‌బాబు, ఎంపీడీవో లోహిత్ జయసాగర్, పీఆర్ ఏఈ వెంకటలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విజయ్ కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కొండమ్మ, నాయకుడు కొండబాబు, తదితరులు పాల్గొన్నారు.

రేపు వైద్య శిబిరం

రంపచోడవరం: స్థానిక సిరగిందలపాడు రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాలలో ఆదివారం ప్రత్యేక ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు మిషన్ కార్యదర్శి స్వామి వినిశ్చలానంద శుక్రవారం ప్రకటనలో తెలిపారు. శిబిరంలో పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేస్తామన్నారు. వేమగిరి పరమ హంస యోగనంద నేత్రాలయం ద్వారా కంటి వైద్య సేవలందిస్తామన్నారు. అవసరమైన వారికి కంటి అపరేషన్లు ఉచితంగా చేసి కళ్లద్దాలు అందజేస్తామని తెలిపారు.

విస్తృతంగా వాహన తనిఖీలు



వాహన రికార్డులు పరిశీలిస్తున్న పోలీసులు

వై.రామవరం: పనసలపాలెం గ్రామ జంక్షన్‌లో శుక్రవారం అడిషనల్ ఎస్‌ఐ రాంబాబు ఆధ్వర్యంలో శుక్రవారం విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు. గంజాయి అక్రమ రవాణా అవుతున్నట్టు వచ్చిన సమాచారం మేరకు ప్రధాన రహదారిలో రాకపోకలు సాగించే వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. వాహన రికార్డులు, డ్రైవింగ్ లైసెన్స్‌లు సక్రమంగా లేని వారిపై కేసులు నమోదు చేశారు. అనుమానితులను ప్రశ్నించి, వివరాలు నమోదు చేసుకున్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఆదేశించారు. తనిఖీల్లో సీఆర్‌పీఎఫ్ డి42 బెటాలియన్ పోలీసు అసిస్టెంట్ కమాండెంటు ఎం.ఎల్.నాయుడు, ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ, సిబ్బంది ఉన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం



లోతేరులో ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

- అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

అరకులోయ రూరల్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. లోతేరు పంచాయతీలోని లోతేరు, కికేటిగూడ, తోటవలస గ్రామాల్లో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే పాల్గుణ నిర్వహించారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షంలోనూ ఆయా గ్రామాల్లో 325 గడపలను సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి యోగక్షేమాలు, సమస్యలు, సంక్షేమ పథకాల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. గిరిజను అభ్యున్నకి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారన్నారు. లోతేరు పంచాయతీ కేంద్రంలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని సిబ్బందిని సూచించారు. లోతేరు ఆశ్రమ పాఠశాలను సందర్శించి, నాడు-నేడు పనులను పరిశీలించారు. పాఠశాల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. హెచ్‌ఎం శెట్టి నారాయణ, సిబ్బందిని అభినందించారు. మెరుగైన విద్యను అందించాలన్నారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ సోమేశ్వరి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గురు, ఎంపీపీ ఉషారాణి, ఎంపీటీసీ సభ్యురాలు రాములమ్మ, హుకుంపేట జెడ్పీటీసీ సభ్యుడు మత్స్యలింగం, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గాసి, తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీడీవో వెంకటేష్, ఏటీడబ్ల్యూవో మల్లికార్జునరావు, నాయకులు రఘునాథ్, అప్పాలు, రామరావు, యాసీన్, సాంబ, దీనవల్లి, సోమేష్, సుందరరావు, శ్రీరాం, నొబో తదితరులు పాల్గొన్నారు.

రాజ్‌మా విత్తనాల పంపిణీ



జోలాపుట్టులో రైతులకు రాజ్మా విత్తనాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ నీలకంఠం,అధికారులు.



సూకురులో రైతులకు విత్తనాలు అందిస్తున్న సర్పంచ్ సత్యవతి



గెమ్మెలిలో గిరిజన రైతులకు రాజ్‌మా విత్తనాలు పంపిణీ చేస్తున్న వైస్ ఎంపీపీ సత్యనారాయణ

జి.మాడుగుల: గెమ్మెలి రైతు భరోసా కేంద్రంలో వైస్ ఎంపీపీ సత్యనారాయణ, వంజరి గ్రామ సచివాలయంలో సర్పంచ్ రవని, వంతాల గ్రామ సచివాలయంలో వైస్ ఎంపీపీ కళ్యాణి, సర్పంచ్ పద్మలు గిరిజన రైతులకు ప్రభుత్వం రాయితీపై అందించిన రాజ్‌మా విత్తనాలు శుక్రవారం పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న రాయితీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అగ్రికల్చర్ అసిస్టెంట్ కామేశ్వరి, వైస్ సర్పంచ్ తిరుపతమ్మ, మాజీ సర్పంచ్‌లు సత్యనారాయణ, కొండబాబు పాల్గొన్నారు.

హుకుంపేట: సూకురు ఆర్‌బీకేలో సర్పంచ్ సత్యవతి తదితరులు రాజ్‌మా విత్తనాలను శుక్రవారం పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మురళి, చిన్నేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: పనసపుట్టు, జోలాపుట్టు, బరడ పంచాయతీల్లో సర్పంచ్‌లు నీలకంఠం, పార్వతి, నోయిన, ఎంపీటీసీ నోట్బాలా, ఏవో మోహన్‌రావు తదితరులు రైతులకు రాజ్‌మా విత్తనాలు అందజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు తిరుపతి, సిబ్బంది సత్య, తరుణ్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఆధ్యాత్మిక సందడి



అన్నసమారాధనకు బియ్యం అందజేస్తున్న ఇన్‌చార్జి ఏఎస్పీ మహేశ్వర్‌రెడ్డి



లడ్డూ వేలంపాటలో భక్తులు

రంపచోడవరం: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా స్థానిక ఐటీడీఏ సీ క్వార్టర్స్ వద్ద మండపంలో శుక్రవారం జరిగిన స్వామి వారి లడ్డూ వేలంపాటలో స్థానికుడు నాగేంద్ర రూ.19500 దక్కించుకున్నారు. సభ్యులు రమణి, సుధాకర్, వాసు, నాగబాబు, ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు. వేములకొండ పంచాయతీలోని రాకోటలో నిర్వహించే అన్న సమరాధనకు రంపచోడవరం ఇన్‌చార్జి ఏఎస్పీ కె.వి. మహేశ్వర్ రెడ్డి రెండు బస్తాల బియ్యాన్ని అందజేశారు.

ఘనంగా వినాయక నిమజ్జనం

డుంబ్రిగుడ: సాగర పంచాయతీ అడపవలస లో వినాయకుడు నిమజ్జనం ఘనంగా నిర్వహించారు.

చిత్తడి దారులతో ఇక్కట్లు



కోతకు గురైన కింటిబడి-దప్పుగూడ రహదారి



రాళ్లు తేలిన కునుకూరి రహదారి

అరకులోయ రూరల్/కొయ్యూరు/ముంచంగిపుట్టు: ఇటీవల కురుస్తున్న వర్షాలకు పలు గ్రామాల్లో రహదారులు కోతకు గురయ్యాయి. అరుకులోయ మండలం గన్నెల పంచాయతీ కింటిబడి- దప్పుగూడ మధ్య రహదారి కోతకు గురైంది. అదే విధంగా కొయ్యూరు మండలం బూదరాళ్ల పంచాయతీ లోయలపాలెం-కనుకూరు మధ్య వేసి రోడ్డు మట్టి కొట్టుకుపోయింది. రాళ్లు తేలి అధ్వానంగా మారిన ఆయా రహదారుల్లో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నామని ఆయా గ్రామస్తులు చెబుతున్నారు. ముంచంగిపుట్టు పెదగూడ పంచాయతీ గత్తుమలడ గ్రామానికి వెళ్లే రహదారి చిత్తడిగా మారడంతో నానా అవస్థలు పడుతున్నామని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.


దుకాణాల్లో పెట్రోల్ విక్రయిస్తే చర్యలు

రాజవొమ్మంగి: రాజవొమ్మంగి, దూసరపాము గ్రామాల్లో దుకాణాల్లో పెట్రోల్ విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ వై.వి.సుబ్రహ్మణ్యాచారి హెచ్చరించారు. ఇటీవల రాజవొమ్మంగి వచ్చిన జేసీ శివ శ్రీనివాస్ ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారన్నారు. రాజవొమ్మంగి, దూసరపాము గ్రామాలకు పెట్రోల్ బంక్ అందుబాటులోకి వచ్చిందన్నారు. జీసీసీ సూపర్‌బజార్‌లో కూడా పెట్రోలు అమ్మకాలను నిలిపివేస్తున్నట్టు తెలిపారు.


గర్భిణులకు వైద్య పరీక్షలు



చవిటిదిబ్బలు పీహెచ్‌సీలో గర్భిణులను పరీక్షిస్తున్న వైద్యాధికారిని శిరీష



గర్భిణులను పరీక్షిస్తున్న జడ్డంగి డాక్టర్ సేవసుజి



చింతపల్లి ఆస్పత్రికి వచ్చిన గర్భిణులు

వై.రామవరం: పీఎంఎస్ఎంఏ కార్యక్రమంలో భాగంగా మండలంలోని చవిటిదిబ్బలు పీహెచ్‌సీలో శుక్రవారం 102 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. సూపరింటెండెంట్ డాక్టర్ జి.శిరీష ఆధ్వర్యంలో గర్భిణులకు స్కానింగ్, రక్తపరీక్షలు చేసి మందులు అందజేశారు. ఇందులో 18 మంది హైరిస్క్ ఉన్న గర్భిణులను ఆస్పత్రిలో చేర్చుకున్నారు. గర్భిణులకు భోజన, వసతి, రవాణా సౌకర్యం కల్పించారు. సిబ్బంది పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమాల్లో భాగంగా మండలంలోని జడ్డంగి పీహెచ్‌సీలో శుక్రవారం 91 మంది గర్భిణులకు వైద్య సేవలందించారు. డాక్టర్ సేవసుజి మాట్లాడుతూ గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి, స్కానింగ్ చేసి, మందులు అందజేసినట్టు చెప్పారు. హైరిస్క్‌లో ఉన్న ఓ గర్భిణిని గుర్తించి వైద్య పర్యవేక్షణలో ఉంచామన్నారు. సిబ్బంది సుధాకర్, వెంకటరమణ, నాగలక్ష్మి, శామ్యూల్, లక్ష్మయ్య, సత్యనారాయణ, ఆశ, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

చింతపల్లిరూరల్: పీఎంఎస్ఎంఏ కార్యక్రమంలో భాగంగా స్థానిక కమ్యూనిటీ ఆసుపత్రిలో చింతపల్లి, గూడెంకొత్తవీధి మండలాలకు చెందిన 250 మంది గర్భిణులకు డాక్టర్ కీర్తి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల గర్భిణులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

పశువైద్య శిబిరాలు నిర్వహించాలి

పెదబయలు: మండలంలోని గోమంగి, గుల్లేలు పంచాయతీల పరిధిలో మేకలు, గొర్రెలు పారుడు వ్యాధితో మృత్యువాత చెందుతున్నాయని పాడి రైతులు చంద్రయ్య, కల్యాణం, మత్స్యరాజు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గుల్లేలు, గోమంగి పంచాయతీల్లో గొర్రెలు, మేకలు పారుడు వ్యాధితో పాటుగా ముక్కు నుంచి నీరు కారుతుందని, నీరసిస్తున్నాయని పశువైద్యాధికారులు స్పందించి వెంటనే గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని వారు కోరతున్నారు.

వ్యవసాయ సేవలు సద్వినియోగం చేసుకోవాలి



చింతపల్లిలో మాట్లాడుతున్న ఎంపీపీ వంతాల బాబురావు



మాట్లాడుతున్న ఏవో రమేష్‌నాయిడు



జీకేవీధిలో సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కుమారి

చింతపల్లి: మండల పరిషత్ కార్యాలయంలో వ్యవసాయ అధికారి కన్నబాబు ఆధ్వర్యంలో వ్యవసాయ సలహా మండలి సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు అందించే సలహాలతో పాటు, ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని, వ్యవసాయ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ-క్రాప్‌ను ప్రతి ఒక్క రైతు నమోదు చేసుకోవాలన్నారు. జెడ్పీటీసీ బాలయ్య, అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: స్థానిక ఆర్‌బీకేలో వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఎంపీపీ బోయిన కుమారి మాట్లాడుతూ అన్నదాత సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తూ, విత్తనాలు, ఎరువులు, పెట్టుబడి సాయాన్ని సకాలంలో అందజేస్తోందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏవో మధుసూదన్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు లక్ష్మణ్, రైతులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: స్థానిక ఆర్‌బీకేలో మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం శుక్రవారం జరిగింది. ఏవో రమేష్‌నాయుడు మాట్లాడుతూ ఈ-క్రాప్ నమోదు వేగవంతం చేయాలన్నారు. జిల్లా వ్యవసాయ కమిటీ సభ్యుడు అప్పారావు, జెడ్పీటీసీ సభ్యురాలు జ్యోతి మాట్లాడుతూ అర్హులైన రైతులకు రాయితీపై వ్యవసాయ సామగ్రి అందజేయాలని, వైఎస్సార్ జలకళ ద్వారా బోరు పనులు చేపట్టాలన్నారు. ఎంపీటీసీ గంగదుర్గ, సభ్యులు అప్పారావు, లింగంమ్మ తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడిని జయించాలి



పెదబయలులో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు,ఉపాధ్యాయులు, పోలీసులు



అవగాహన కల్పిస్తున్న అడిషనల్ ఎస్‌ఐ రాంబాబు

పెదబయలు: విద్యార్థులు మానసిక వత్తిడిని జయించాలని జి.మాడుగులు సీఐ సత్యనారాయణ అన్నారు. స్థానిక గురుకుల పాఠశాలను ఆయన శుక్రవారం సందర్శించారు. సమస్యలు-ఆత్మహత్యలు అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సమస్యలతో ఒత్తిడిని తట్టుకోలేక ఆత్మహత్యలకు పాల్పడడం చాలా బాధాకరమన్నారు. మానసిక ఒత్తిడిని జయిస్తే ఉన్నత శిఖరాలు చేరుకుంటారన్నారు. విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండి, ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వ్యాయామం దినచర్యలో భాగంగా చేసుకోవాలన్నారు. మంచి మార్గంలో నడుస్తామని, మానసిక ఒత్తిడిని జయిస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఎస్‌ఐ మనోజ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యలను ధైర్యంగా ఎదుర్కొవాలి

వై.రామవరం: పి.యర్రగొండ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో అడిషనల్ ఎస్‌ఐ రాంబాబు అధ్యక్షతన శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సమస్యను ధైర్యంగా ఎదుర్కొని జీవితాన్ని ముందుకు సాగించాలన్నారు. విద్యార్థులు పలు సమస్యలతో ఆత్మహత్యలు చేసుకోవడం బాధాకరమని, ఇది పద్ధతి కాదన్నారు. ప్రాణాలను బలిచేసుకోవడం వలన మానవ జన్మకు అర్థం లేదన్నారు. ఎంతటి బలమైన సమస్య ఎదురైనా చాకచక్యంతో ధైర్యంగా ఎదుర్కొవాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ శ్రీపాద రామకృష్ణ, హెచ్‌సీలు రమణ, ప్రభుకుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు



మాట్లాడుతున్న ఎంపీడీవో ఉమామహేష్

గూడెంకొత్తవీధి: మండల పరిషత్ కార్యాలయంలో హెచ్‌ఎంలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో ఎంపీడీవో ఉమా మహేష్ శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నాడు-నేడు రెండవ విడతలో మండలంలోని 55 పాఠశాలలకు రూ.60కోట్లు మంజూరైందని, పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. పాఠశాలల్లో కార్పొరేట్‌కు దీటుగా మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ఎంఈవో చంద్రశేఖర్, ఈవోపీఆర్డీ పాపారావు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



దుచ్చరపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహార ప్రదర్శన

గూడెంకొత్తవీధి : పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని దుచ్చరపాలెం అంగన్వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీడీపీవో దుర్గలక్ష్మి మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకోవడంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. గర్భిణులు పోషకాహారం తీసుకోవడం ద్వారా సుఖ ప్రసవాలతో పాటు రక్తహీనత నుంచి బయటపడవచ్చన్నారు. తల్లిబిడ్డల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.అంగన్‌వాడీ కార్యకర్తలు గంగభవాని, సావిత్రి, అప్పలనర్స, భవాని, రాధ, రాణి, కమలమ్మ, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.